# విపత్తుల నివారణ... మార్గాలు

విపత్తుల నివారణపై ఆసియా దేశాల మంత్రిత్వ స్థాయి రెండో సదస్సు గతేడాది నవంబరు 7, 8 తేదీల్లో ఢిల్లీలో జరిగింది. ఈ సదస్సులో ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రసంగించారు. విపత్తుల నివారణకు అభివృద్ధి చెందుతున్న దేశాలు సమష్టిగా కృషి చేయాలని ఆ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. మానవ తప్పిదాల వల్ల పరిశ్రమల్లో సంభవించే ప్రమాదాలైనా.. ఉగ్రవాదుల దాడుల వల్ల ఎదురయ్యే నష్టాలనైనా.. ఎదుర్కోడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ ప్రాంతానికి ఉగ్రవాదం ముప్పు పొంచి ఉందని.. సరిహద్దుల్లో బాంబు పేలుళ్లకు పాల్పడే ప్రమాదముందని మన్మోహన్ హెచ్చరించారు. భారత్‌లో ఉగ్రవాదానికి ఊతం ఇస్తోందంటూ ఆయన పాకిస్థాన్‌ను తప్పుపట్టారు. ఆ దేశం ప్రస్తుతం సంక్షోభ పరిస్థితిని ఎదుర్కొంటోందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సవాళ్లను తిప్పికొట్టేందుకు ఆసియా దేశాలన్నీ ఒక ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించుకోవాలని కోరారు. హెచ్ఐవీ, ఏవియన్ ఇన్‌ఫ్లూయాంజా వంటి వ్యాధుల వ్యాప్తివల్ల తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. భూకంపాలు, వరదలు, సునామీల కారణంగా ఇటీవల ఆసియా దేశాలు కష్టాలు పడిన సంగతిని మన్మోహన్ గుర్తు చేశారు. ఆసియా దేశాలు ఇలాంటి విపత్తులను ఎదుర్కొనేందుకు... ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించు కోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. సముద్రంలో సంభవించే సునామీల వంటి ప్రకృతి వైపరీత్యాలను ముందుగా పసిగట్టేందుకు 'సునామీ ఎర్లీ వార్నింగ్ సిస్టమ్'ను రూపొందించుకున్న తరహాలోనే ఈ ప్రాంతంలోని దేశాల మధ్య ప్రాంతీయ సహకారం అవసరమన్నారు.

### ఢిల్లీ డిక్లరేషన్:

రెండు రోజుల పాటు జరిగిన సదస్సు ముగింపు సమావేశంలో... 26 అంశాలతో కూడిన కార్యాచరణ విధానాన్ని(ఢిల్లీ డిక్లరేషన్) ఆమోదించి, ప్రకటించారు. విపత్తులు సంభవించకుండా ముందుగానే ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిందిగా ఆసియా దేశాలకు ఈ డిక్లరేషన్ పిలుపునిచ్చింది. డిక్లరేషన్ ముఖ్యాంశాలు.. హైగో ఫ్రేంవర్క్‌ను అనుసరించి ప్రభుత్వాలన్నీ తమ ప్రాంతంలోని వివిధ ఏజెన్సీలతో కలిసి విపత్తుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ఆపత్సమయ నిర్వహణకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి విపత్తులను నివారించేందుకు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను నిర్మించుకోవాలి. విపత్తు సంభవించగానే నష్టనివారణకు వీలుగా సత్వరమే సహాయ, పునరావాస చర్యలకు సమష్టిగా కృషి చేయాలి. రెండేళ్లకు ఒకసారి జరిగే ద్వైవార్షిక ఆసియా మంత్రిత్వ స్థాయి సదస్సు మొదటి సమావేశం, 2005లో బీజింగ్‌లో జరిగింది. ఈ సదస్సును విపత్తుల నిర్వహణ నివారణ ప్రాంతీయ వేదికగా మార్చి... అందులో ఆయా ప్రభుత్వాలు, ప్రాంతీయ, ఉప ప్రాంతీయ సంస్థలు, ఐరాస ఏజెన్సీలు, ఇంకా వివిధ సామాజిక, శాస్త్ర, సాంకేతిక సంస్థలు, ప్రైవేటు రంగం కూడా పాల్గొనేలా చేయాలని డిక్లరేషన్ పిలుపునిచ్చింది.

## ఉమ్మడి చర్యలు:

ఆసియా దేశాలు మంత్రిత్వ స్థాయి సదస్సును రెండేళ్లకోసారి రొటేషన్ పద్ధతిలో నిర్వహిస్తాయి. ఈ సదస్సులో విపత్తుల నివారణకు చేపట్టిన ఉమ్మడి చర్యలను సమీక్షిస్తారు. విపత్తులను తట్టుకునేందుకు ప్రభుత్వాల మధ్య మరింత సహకారం పెంపొందించేందుకు సదస్సు కృషి చేస్తుంది. వచ్చే సదస్సును కౌలాలంపూర్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. విపత్తుల నష్టాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పరస్పరం అభిప్రాయాలను తెలుసుకునేందుకు 50 దేశాల ప్రతినిధులకు ఈ సదస్సు ద్వారా అవకాశం లభించిందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఆసియా ప్రాంతంలో విపత్తులను నివారించేందుకు ఆయా దేశాలను ఒకే తాటిపైకి తెచ్చే ఉమ్మడి ప్రణాళికలపై చర్చించేందుకు ఇలాంటి సదస్సు ఉపయోగపడు తుందన్నారు. విపత్తుల వల్ల జరిగే నష్టాన్ని గుర్తించి, వాటి తీవ్రతను తగ్గించడానికి సంయుక్త కృషి అవసరమన్న విషయాన్ని ఆసియా దేశాల సదస్సు గుర్తించడం మంచి పరిణామ మని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ముఖ్యాంశాలు:

వైపరీత్యాలు చెప్పి రావని, విపత్తులకు ఏ దేశమూ మినహాయింపు కాదని గతేడాది నవంబరులో జరిగిన ఐరాస సర్వ సభ్య సమావేశంలో పాల్గొన్న భారత ప్రతినిధి ప్రభా ఠాగూర్ పేర్కొన్నారు. అందువల్ల విపత్తుల నివారణకు, నిర్వహణకు దేశాలన్నీ ఉమ్మడిగా సహకరించుకోవాలని సూచించారు.

విపత్తుల వల్ల సంభవించే నష్టాన్ని తగ్గించేందుకు అధునాతన సాంకేతికతను వినియోగించుకోవడం.. ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ సహకారం సాధించుకోవడం..అలాగే ప్రకృతి వైపరీత్యాలకు తరచు నష్టపోయే ప్రాంతాలలో బీమా సౌకర్యాలను విస్తరించి, ఆదుకోవాలని భారతదేశం సూచించింది.

అత్యవసర మందుల సరఫరా, గాలింపు, తక్షణ సహాయ చర్యలు; రిమోట్ సెన్సింగ్, వేగంగా సమాచారం అందించే వ్యవస్థ.. వీటన్నిటినీ సమన్వయం చేసే నిపుణులతో ఆపత్సమయ నిర్వహణ ఒక శాస్త్రంగా మారిందని ఎన్‌డీఎంఏ సభ్యుడు వినోద్ చంద్ర మీనన్ అన్నారు. సునామీలను ముందుగానే గుర్తించి, హెచ్చరించే వ్యవస్థను గతేడాది నవంబరు నుంచి ప్రవేశపెట్టడం ద్వారా... విపత్తుల రక్షణ వ్యవస్థను బలోపేతం చేసినట్లు అయిందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

ఆపత్సమయంలో ఆదుకునేందుకు, విలువైన సమయం నష్టపోకుండా వెంటనే రంగంలో దిగేందుకు కేంద్ర హోం శాఖ కొత్త 'ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్స్ సెంటర్'ను ప్రారంభించింది. ఇందులో అధునాతన

ఉపగ్రహ సమాచార వ్యవస్థ, డిజిటల్ మ్యాపులు, ల్యాప్‌టాప్‌లతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలు, జిల్లాలలోని కంట్రోల్ రూమ్‌ను అనుసంధానిస్తూ.... ల్యాన్ నెట్‌వర్క్, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించుకోగల సౌకర్యాలను అమర్చారు.

ప్రభుత్వ ప్రతిపాదిత విపత్తుల నిర్వహణ విధానం... విపత్తుల నష్టాల నివారణ, సహాయచర్యల కోసమేకాక.. వైపరీత్యాలను కూడా అభివృద్ధికి అనుకూలంగా మార్చుకునే సరికొత్త ఓరియంటేషన్ అని కేంద్ర రక్షణ మంత్రి ప్రణబ్ ముఖర్జీ ప్రకటించారు. విపత్తులు ఏ మారుమూల సంభవించినా.. వెంటనే స్పందించి కార్యరంగంలోకి దూకేందుకు వీలుగా జిల్లా యంత్రాంగం, పంచాయతీ రాజ్, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను పటిష్ఠ పరచేందుకు విపత్తు నిర్వహణ విధానాన్ని రూపొందిస్తున్నట్టు ఆయన తెలిపారు.